క్లుప్తంగా

ద్విచక్రవాహనాల చోరీ

దంతాలపల్లి: మండలకేంద్రంలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పిల్లల రాజు శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బుర్ర ముత్తు ఆయన పల్సర్ వాహనాన్ని గురువారం సాయంత్రం ఇంటి ముందు ఉంచి ఇంట్లోకి వెళ్లాడు. కాసేపటికి బయటకు వచ్చి చూసేస రికి వాహనం కనిపించలేదు. వాహనం ఆచూకీ లభించక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

నర్సింహులపేటలో..

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం స్టేజీ వద్ద నర్సింహారావు అనే వ్యక్తి గ్లామర్ బైక్‌ను శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి ముందర ఉన్న వరండాలో బైక్‌ను పెట్టాడు. ఉదయం 4 గంటల ప్రాంతలో నిద్రలేచి చూసే సరికి బైక్ కన్పించలేదు. బైక్ చోరీ జరిగినట్లు పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



పెద్దవంగర: సస్యరక్షణతోనే తెగుళ్ల నివారణ సాధ్యమని మరిపెడ ఏడీఏ విజయ్‌చంద్ర తెలిపారు. మండలంలోని కొరిపెల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు పలు రకాల పంటలను పరిశీలించారు. రైతులకు పలు అంశాలపై సూచనలిచ్చారు. ఏడీఏ మాట్లాడుతూ.. వాతావరణంలో అసాధారణ మార్పుల కారణంగా పంటల దిగుబడుల అంచనాలు తలకిందులవుతున్నాయన్నారు. సకాలంలో పంటలను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఓ స్వామి, ఏఈఓ యశస్విని, రైతులు పాల్గొన్నారు.

టీచర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు కాసం శ్రీనివాసరావుకు టీచర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యాడు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సైకి లైఫ్ ఫౌండేషన్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ బాధ్యులు హైదరాబాదు బిర్లా ప్లానిటోరియం ఆడిటోరియంలో ఆదివారం శ్రీనివాసరావుకు అవార్డును అందజేసి సత్కరించనున్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సోహెన్, శ్రీధర్ రెడ్డి, శోభారాణి, తిరుపతి, సతీష్ కుమార్, ఝాన్సీ, తదితరులు అభినందనలు తెలిపారు.

సైన్స్ సెమినార్‌లో విద్యార్థిని ప్రతిభ



దంతాలపల్లి: జిల్లా కేంద్రంలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై జరిగిన సైన్స్ సెమినార్‌లో దంతాలపల్లి విద్యార్థి జ్యోత్స్న నాల్గో బహుమతి సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయలు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి, గైడ్ ఉపాధ్యాయుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

రుణాలు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్: మండలంలోని జంగిలిగొండ గ్రామ ఎస్సీ, ఎస్టీ రైతులకు పంట రుణాలు ఇప్పించాలని కోరుతూ ఎంపీ పోరిక బలరాంనాయక్‌కు టీడీపీ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా టీడీపీ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు పంట రుణాలు ఇప్పించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్ వ్యాస్, చందు పాల్గొన్నారు.

టీకాలతో రోగనిరోధక శక్తి

డోర్నకల్: పశువులకు టీకాలు వేస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.కిరణ్‌కుమార్ తెలిపారు. డోర్నకల్‌లో శనివారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వర్ రావు, చందర్, సులేమాన్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

బయ్యారం: పాలకులు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులు పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బయ్యారంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు రాజన్న, మధు, ఆనందరావు, మోహన్, యాకూబ్, వెంకన్న పాల్గొన్నారు.

వాగు దాటేదెట్లా?

- వర్షాలకు కొట్టుకుపోయిన పాలేరు వాగు లోలెవల్ బ్రిడ్జి
- పలు గ్రామ పంచాయతీలకు రాకపోకలు బంద్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- వరదలు వచ్చినప్పుడల్లా ఇదే దుస్థితి



వాగులో కొట్టుకుపోయిన లోలెవల్ బ్రిడ్జి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధి గంగాభవాని ఆలయం సమీపంలోని పాలేరు వాగుపై నిర్మించిన లోలెవల్ బ్రిడ్జి గత నెలలో కురిసిన భారీ వర్షాల దాటికి కోతకు గురై కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకాలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగు అవతలి ఒడ్డున ఉన్న వాల్యతండా, కోట్యతండా, అజ్మీరతండా గ్రామ పంచాయతీ పరిధిలలోని సుమారు 12తండాల గిరిజన ప్రజలు ఈ వాగుపై రాకపోకలు కొనసాగిస్తుంటారు. కానీ గత నెలల్లో కురిసిన భారీ వర్షాల దాటికి పాలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో లోలెవల్ బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోయి రాళ్లు తేలాయి. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా బ్రిడ్జి మొత్తం ఆనవాళ్లు కొట్టుకొని పోయింది.

నిలిచిన రాకపోకలు..

పాలేరు వాగుపై లోలెవల్ వంతెన కొట్టుకొని పోవడంతో రెండు నెలలుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కనీసం ద్విచక్ర వాహనం వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాల ప్రజలు చుట్టు తిరిగి సూర్యాపేట జిల్లా బికుమళ్ల గ్రామం శివారు 356 జాతీయ రహదారిపై నిర్మించిన బ్రిడ్జి నుంచి రాకపోకలు చేస్తున్నారు.

ప్రతీ ఏడాది ఇదే అవస్థ..



వర్షాలు కురిసి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడల్లా రాకపోకలు లేక ఇబ్బందుల పాలు కావాల్సి వస్తుంది. లోలెవల్ బ్రిడ్జి కావడంతో పైనుంచి వాగు ప్రవహిస్తుంది. వాగు దాటే దారి లేక మండల కేంద్రానికి వెళ్లె లేక పోతున్నాం. ప్రతీ ఏడాది ఇదే అవస్థలు పడాల్సి వస్తుంది. - తేజావత్ బాలనాయక్, వాల్యతండా, మరిపెడ

బ్రిడ్జి టెండర్ రద్దు

గత ప్రభుత్వం హయాంలో పాలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కాగా పాలేరు వాగుపై కోతకు గురైన లోలెవల్ బ్రిడ్జికి రూ.1.20కోట్లు నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. చివరి నిమిషంలో సంబంధిత అధికారులు బ్రిడ్జి టెండర్ పనులు రద్దు చేశారు. మళ్లీ లోలెవల్ వంతెన నిర్మిస్తే దానిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుందని, అందుకు ఈ నిధులు సరిపోవని హైలెవల్‌లో బ్రిడ్జిని నిర్మించాలని దానికి సుమారు రూ.8 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు వెల్లడించారు.

క్రమం తప్పకుండా వ్యాక్సిన్ తీసుకోవాలి



క్యాంపును సందర్శించిన మెడికల్ ఆఫీసర్ రవి

మరిపెడ రూరల్: పుట్టిన పిల్లల నుంచి 16 సంవత్సరాల పిల్లలు, గర్భిణీలు క్రమం తప్పకుండా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో వ్యాక్సినేషన్ చేయించుకోవాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గుగులోతు రవి సూచించారు. శనివారం మండలంలోని గిరిపురం గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర వ్యాధి నిరోధక కార్యక్రమాన్ని డాక్టర్ రవికుమార్ సందర్శించారు. ఈసందర్భంగా వ్యాక్సిన్ కారియర్, వ్యాక్సినేషన్ కండిషన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు సోకకుండా ఇంటి పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మికుమారి, ఏఎన్‌ఎం నర్సుబాయి, నాగమణి, ఆశ కార్యకర్త కవిత పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు సాగుతో అధిక లాభాలు

దంతాలపల్లి: రైతులు తమ పంటలను మార్చినప్పుడు ప్రత్యామ్నాయ పంటగా పొద్దుతిరుగుడు పంటను ఎంచుకోవాలని మరిపెడ డివిజన్ ఏడీఏ విజయ్ చంద్ర అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు పొద్దు తిరుగుడు పంటపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంట సాగులో భాగంగా జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద(ఎన్ఎఫ్ఎస్ఎం) పొద్దు తిరుగుడు విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. నీటి లభ్యత ఉన్న రైతులు ఈ పంటలను పండించి అధిక లాభాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని కుమ్మరికుంట్ల, గున్నెపల్లి, వేములపల్లి గ్రామాలలోని వరి, పత్తి పంటలు పరిశీలించారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ విజయ్ చంద్ర

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల: ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గార్లలో ఆయన మాట్లాడారు. మండలంలో రుణమాఫీకి అర్హత కలిగివున్న అనేక మంది రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. చెబుతుందని, కాని నేటికీ ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు ఇమ్మడి గోవింద్, హరి, రాజారావు, ఈశ్వర్‌లింగం, వీరస్వామి, సత్యవతి, రమ, నాగమణి, ఎల్లయ్య, లోకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్ల తొలగింపు హేయమైన చర్య

తొర్రూరు: గీత కార్మికుల జీవనాధారమైన తాటిచెట్ల తొలగింపు హేయమైన చర్య అని కేజీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గునిగంటి మోహన్ అన్నారు. నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట గ్రామంలో తాటిచెట్ల తొలగింపును నిరసిస్తూ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట గీత కార్మికులు ఆందోళన చేపట్టారు. మోహన్ మాట్లాడుతూ.. బొజ్జన్నపేటలో కక్షపూరితంగా తాటిచెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధీకొండ మధు, నాయకులు రామన్న, నలమాస శ్రీను, మేరుగు కృష్ణ, వెంకన్న, యాకాంబ్రం, అశోక్, వీరన్న, శ్రీను, యాకాంబ్రం, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గీత కార్మికులు

పిడుగుపాటుతో జీవాల మృతి



బయ్యారం: మృతి చెందిన కాడెద్దులు

బయ్యారం: మేతకు వెళ్లిన పశువుల వద్ద పిడుగుపడడంతో రెండు కాడెద్దులు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని వినోభానగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోలా వెంకన్న పశువులను మేత కోసం తీసుకెళ్లి మిరపతోట సమీపంలో కట్టేసిన సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈక్రమంలో పిడుగుపడటంతో రెండు కాడెద్దు అక్కడికక్కడే మృతి చెందాయి.

పాడి గేదె..

పెద్దవంగర: మండల కేంద్రానికి చెందిన అనపురం వెంకటయ్య తన వ్యవసాయం పొలం వద్దకు పాడిగేదెను మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. దీంతో మేస్తున్న పాడి గేదెపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.60వేల విలువ నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

దొంగ అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 11గ్రాముల బంగారు, 104 గ్రాముల వెండి గ్లాసులు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం రాత్రి తెలిపారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయ సెంటర్ వద్ద టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నాడు. ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకుని విచారించగా గార్ల మండలానికి చెందిన చింత అశోక్‌గా గుర్తించారని తెలిపారు. చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. కురవిలోని ఒక ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు, గార్ల వైన్ షాపులో కొంత నగదు, మహబూబాబాద్ పట్టణంలో రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడని వివరించారు. చోరీ మొత్తం సుమారుగా రూ.2లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. అతడు 15 ఏళ్లుగా మహబూబాబాద్, గార్ల, ఇల్లెందు, ఖమ్మంలో దొంగతనాలు చేసి చాలా సార్లు జైలుకు వెళ్లి వచ్చాడన్నారు.

కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు

తొర్రూరు: కార్మికుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఐఎఫ్‌టీయూ సంఘం టీయూసీఐలో విలీనం సందర్భంగా నేడు హైదరాబాద్‌లో సభ జరగనున్న నేపథ్యంలో శనివారం డివిజన్ కేంద్రంలో కరపత్రాలు పంచి కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాం పుల్లయ్య, మంగళపల్లి ప్రసాద్, నర్సింహ, యాకయ్య, రాజు, కృష్ణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలి

నెల్లికుదురు: గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తూ తండావాసులను తప్పుదోవ పట్టిస్తున్న పంచాయతీ కార్యదర్శి పి.చందనపై చర్య తీసుకుని న్యాయం చేయాలని మండలంలోని కాస్య తండా (సద్యతండా) తండాకు చెందిన బి.వెంకన్న, బి.రాజేష్ తండావాసులతో కలిసి కలెక్టర్, డీపీఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. పంచాయతీ నిధులు కార్యదర్శి తన సొంతానికి వాడుకుంటూ నిధుల దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సోమ్లా, సురేష్, బాలాజీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గౌడ హక్కుల సాధనకు ఉద్యమిద్దాం



మహబూబాబాద్ రూరల్: జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంఘం నాయకులు



గార్ల: జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్: తాటి, ఈత వనాలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుంటూ గౌడ హక్కుల కోసం ఉద్యమిద్దామని గీత పనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తండా సతీష్ గౌడ్ అన్నారు. మండలంలోని ముడుపుగల్ గ్రామంలో తెలంగాణ గీత పని వారల సంఘం 67వ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేముల కృష్ణ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేష్, వెంకన్న, దశరథ, మల్లయ్య, రమేష్, వెంకటనారాయణ, సందీప్, గురుస్వామి పాల్గొన్నారు.

గార్ల: గీత కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించాలని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దోసరి శ్రీరాములుగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం గార్లలో సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతు రామూర్తిగౌడ్, ఉపాధ్యక్షుడు తండా సతీష్‌గౌడ్, బాబు, రమేశ్ గౌడ్, శ్రీనుగౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: గీత కార్మికులు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తండ చిన్న రామన్న అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో శనివారం సంఘం జెండా ఆవిష్కరించారు.

కెపాసిటర్లతో విద్యుత్ ఆదా

డోర్నకల్: వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు వినియోగిస్తే విద్యుత్ వాడకం ఆదా అవుతుందని విద్యుత్‌శాఖ డీఈ విజయ్ కోరారు. మండలంలోని ముల్కలపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూముల్లో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించి రైతులతో కలిసి వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్ మోటార్లను పరిశీలించారు. విద్యుత్ సమస్యలు ఉంటే సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ రమేష్, ఏఈ కిరణ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు రూరల్: పంటల సాగు కోసం బోర్లు, మోటార్ల వినియోగంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ డీఈ మధుసూదన్ కోరారు. శనివారం మండలంలోని ఖానాపురం గ్రామంలో విద్యుత్‌శాఖ వారి ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు చలపతిరావు, సుధాకర్, లైన్‌మెన్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



డోర్నకల్: మాట్లాడుతున్న డీఈ విజయ్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి సరిత

తొర్రూరు: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత అన్నారు. డివిజన్ కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. బాలికలు, మహిళల రక్షణ, చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయని, చట్టాలతో కేసుల దర్యాప్తు విధానం, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వనజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

21నుంచి వ్యాసరచన పోటీలు

నెల్లికుదురు: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించకుని ఈనెల 21న ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు శనివారం తెలిపారు. 8వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ పిల్లలకు మొబైల్ ఫోన్ వినియోగం పాత్రపై, డిగ్రీ విద్యార్థులకు రాష్ట్ర డ్రగ్ రహిత నిర్మాణంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 27 వరకు పోలీస్ శాఖ వారి ఆన్‌లైన్ లింక్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

విద్యార్థుల ప్రగతిపై చర్చ

నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రగతిపై శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బొల్లం అనిత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో వసతులతోపాటు విద్యార్థుల ప్రోగ్రెస్ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమయ్య, జగదీష్, భాస్కరాచారి, అశోక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



నెల్లికుదురు: యువత సైబర్ నేరాల ఉచ్చులో పడిపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చిర్ర రమేశ్ బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్సై పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

మరిపెడ: మండల కేంద్రంలోని సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అఫ్జల్, తాజుద్దీన్, గంగయ్య, ముత్యం రాకేష్, లింగయ్య, బల్లెం రవి, యాకూబ్‌పాష, సర్వర్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

చిన్నగూడూరు: విద్యుత్ వినియోగదారుల సదస్సును వినియోగదారులు వినియోగించుకోవాలని చిన్నగూడూరు విద్యుత్ ఏఈ నవ్య అన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాలచారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు సోమవారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు

కొత్తగూడ: విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలైన సంఘటన మండలంలోని రేణ్యాతండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు వష్య పొలం వద్ద మోటార్ నడవక పోవడంతో విద్యుత్ వైర్లు సరి చేసేందుకు యత్నిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలింది. దీంతో కుడి కాలు, చేయి, వీపు కాలి బొబ్బలు వచ్చాయి. పక్క రైతులు గమనించి 108కు సమాచారం అందించారు. నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

టీషర్ట్స్ పంపిణీ

బయ్యారం: మండలంలోని గురిమెళ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం యూనిఫాం టీషర్ట్స్ ఉప్పలపాడు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎన్.ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, సభ్యులు క్రిష్టయ్య, ఉపాధ్యాయులు సక్రు, రాంజీ, గౌస్‌పాషా, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

డోర్నకల్: ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగం పొంది సొంత గ్రామంలో చదువుకున్న పాఠశాలలో విధుల్లో చేరిన ఉపాధ్యాయుడు వెగ్గళం విజయ్‌ను శనివారం వెన్నారం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోయిన వెంకన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శెట్టి వెంకన్న, చిన్న భాస్కర్, శ్రీనివాసాచారి, వీరయ్య, ఉపాధ్యాయులు సక్రాం పాల్గొన్నారు.

మైక్ సెట్ వితరణ

తొర్రూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1974–75 బ్యాచ్ ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు మైక్ సెట్ వితరణ చేశారు. పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని 50 ఏళ్ల సమీపిస్తున్న తరుణంలో పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు మన్నూరు ఉమ, రాజనర్సింహ రెడ్డి, మంగళపల్లి రామస్వామిలతోపాటు పలువురు పూర్వ విద్యార్థులు హెచ్‌ఎం లక్ష్మీ నారాయణకు శనివారం మైక్ సెట్ అందించారు.

నిత్యావసరాల పంపిణీ

కురవి: మండల కేంద్రానికి చెందిన యూట్యూబర్ గంగరబోయిన రఘు శనివారం ఇదే గ్రామంలోని సీపీఐ కాలనీలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు లేక అనాథలుగా మారిన చిన్నారులకు నిత్యావసరాలను అందజేశాడు. దాత శ్రీకాంత్‌రెడ్డి కుమారుడైన సిద్ధాంత రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పంపిణీ చేశాడు. కార్యక్రమంలో నల్లు సుధాకర్‌రెడ్డి, తురక రమేష్, వీరన్న, వెంకటమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

ఎస్సై కుటుంబాన్ని ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామానికి చెందిన దళిత ఎస్సై శ్రీరాముల శ్రీను కుటుంబాన్ని ఆదుకోవాలని, ఆయన మృతికి కారణమైన వారిపై చర్య తీసుకోవాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురిమిళ్ల రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సై కుటుంబ సభ్యులతో కలిసి శనివారం నిరసన తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మం రూరల్: టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం శివారు రాంతండాకు చెందిన భూక్యా రవి(40) ఈనెల 11న టీవీఎస్‌పై ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెం వెళ్తున్నాడు. మార్గమధ్యలో మంగళగూడెం సమీపాన వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయాడు. ఈ ఘటనలో రవికి తీవ్ర గాయాలు కాగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై రవి భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ సీఐ ముష్కన్ రాజు తెలిపారు.

భవన నిర్మాణానికి సహకరించాలి



మహబూబాబాద్ రూరల్: శ్రీరామానుజ భవన నిర్మాణానికి సహకరించాలని కోరుతూ ఎంపీ పోరిక బలరాంనాయక్‌కు జిల్లా చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కేసముద్రం మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు పెరంబుదూరు వెంకటస్వామి మాట్లాడుతూ.. శ్రీరామానుజ భవన నిర్మాణానికిగాను సీడీఎఫ్ నుంచి రూ.15లక్షలు మంజూరు చేయాలని, ఇందిరమ్మ గృహాలు కూడా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ బీసీ ఉపాధ్యక్షుడు తిరుత్తమాల మురళీధర స్వామి, పరాంకుశం అనంతస్వామి, రామాయణం సుదర్శనస్వామి, వెంకటరమణ, శ్రీనివాసస్వామి పాల్గొన్నారు.